క్లుప్తంగా

నిత్యావసరాల పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని చిన్నబండిరేవు గ్రామానికి చెందిన అనాథ గణప సత్యంకు మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసరాలను శనివారం అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి మాట్లాడుతూ.. ట్రస్ట్ సభ్యులందరి సహకారంతో సాయం అందించామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు చైతన్య, సాయికుమార్, బాలరాజు, సర్వేశ్, నాగరాజు, తెల్లం కృష్ణ గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సుభాష్‌నగర్‌కాలనీకి చెందిన నిరుపేద బానోత్ సుభద్ర కుటుంబానికి చేతన మీసేవా ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐ మధుప్రసాద్ చేతుల మీదుగా శనివారం అందజేశారు. భర్త మరణించడంతో పాటు ఆమెకు అనారోగ్య సమస్యలున్నాయి. ఇద్దరు పిల్లల్లో ఒకరు మానసిక దివ్యాంగురాలు. విషయం తెలుసుకున్న రంజిత్ సుభద్ర కుమారుడు రాకేశ్‌ను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో సీతా మహాలక్ష్మి, మాన్‌సింగ్, కొప్పుల మురళి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా సావనీర్‌లో 'పేట' కవులకు స్థానం

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ అమెరికన్ తెలుగు సంఘం ఆధ్వర్యాన ఇటీవల నిర్వహించిన మెగా కన్వెన్షన్ కోసం ముద్రించిన సావనీర్‌లో అశ్వారావుపేటకు చెందిన కవుల రచనలకు అవకాశం దక్కింది. వాషింగ్టన్‌లోని సీటెల్‌లో నిర్వహించిన మహాసభల్లో ఈ సావనీర్‌ను విడుదల చేశారు. అశ్వారావుపేటకు చెందిన కవి, రచయిత డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు రచించిన 'తెలంగాణ సాహిత్య చరిత్రకు చేవ్రాలు పాల్కురికి సోమన' వ్యాసం, బాలకథకుడు సిద్ధాంతపు సాత్విక్ సాయికుమార్ రాసిన 'అపాయంలో ఉపాయం' కథను ఇందులో ముద్రించగా వారిని పలువురు అభినందించడంతో పాటు సావనీర్ కమిటీ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్ నిర్లక్ష్యం చేసింది..

చర్ల: నాలుగు దశాబ్దాల కాలంగా తెలంగాణలో జీవనం సాగిస్తూ ఇక్కడి గిరిజనులతో మమేకమై ఉన్న ఆదివాసీలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురి చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వమైనా వలస ఆదివాసీలను పట్టించుకోవాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి కొండా చరణ్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పలు వలస ఆదివాసీ గ్రామాల్లో ఆయన పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు కొండా కౌశిక్, కన్నయ్య, రమేశ్, లక్ష్మయ్య, రాజు, భద్రయ్య, నాగేశ్ పాల్గొన్నారు.

రాంబాబు సేవలు అభినందనీయం

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అభివృద్ధికి బాచినేని రాంబాబు చేసిన సేవలు అభినందనీయమని సంఘం అధ్యక్షుడు అబ్బినేని శ్రీనివాస్ అన్నారు. స్థానిక పీఏసీఎస్ సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సన్మాన సభలో పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు రాంబాబు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొమ్మనపల్లి సత్యనారాయణ, శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఉద్యోగికి సన్మానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం సహాయకురాలిగా విధులు నిర్వర్తిస్తున్న కంకటి యశోద ఉద్యోగ విరమణ చేయగా, శనివారం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్య మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖలో డెయిలీవేజ్ వర్కర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన యశోద అంకితభావంతో పనిచేయడంతో పర్మనెంట్ చేశారని, అనారోగ్య సమస్యలతో శరీరం సహకరించకున్నా ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించారని కొనియాడారు.

పదోన్నతుల పత్రాలివ్వాలి

మణుగూరురూరల్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్ల పదోన్నతులకు సంబంధించిన నియామకపు పత్రాలను వెంటనే ఇవ్వాలని ఆపరేటర్స్ నాయకులు ఎస్‌డీ నాజర్‌పాషా కోరారు. శనివారం ఏరియా డీజీఎం (పర్సనల్) సలగల రమేశ్‌కు వినతిపత్రం అందించారు.

దుంగలను తొలగించాలి

ములకలపల్లి: ములకలపల్లిలో సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా నరికివేసిన చెట్ల దుంగలను వెంటనే తొలగించాలని సీపీఐ మండల కార్యదర్శి ఎండీ యూసుఫ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. ఆర్అండ్‌బీ పరిధిలో రోడ్డుకిరువైపులా ఉన్న మారుజాతి చెట్లను నరికివేసి, రెండు వారాలు కావొస్తున్నా, వాటి తరలింపునకు చర్యలు తీసుకోలేదన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి

బూర్గంపాడు: సనాతన హిందూ ధర్మాన్ని కాపాడుకోవటానికి నడుంబిగించాలని విశ్వ హిందూ పరిషత్ మండల ప్రఖండ ప్రముఖ్ తిరుపతి రామారావు అన్నారు. సారపాక సత్యధామంలోని శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఇస్మార్ట్ ట్రెండ్ !



ఎలక్ట్రానిక్ గాడ్జెట్లపై యువతలో క్రేజ్ పెరిగిపోతోంది. మార్కెట్‌లో అనేక గ్యాడ్జెట్స్ అందుబాటులోకి వచ్చాయి. ఈ పరికరాల కొనుగోలు కోసం యువత ఆసక్తి కనబరుస్తోంది. యువత ఫేవరెట్ లిస్టులో మరో గ్యాడ్జెట్ వచ్చి చేరిపోయింది. అదే స్మార్ట్ వాచ్. ప్రస్తుతం ఎవరి చేతికి చూసినా స్మార్ట్ వాచ్ కనిపిస్తోంది. ఒకప్పుడు కేవలం సమయానికి మాత్రమే పరిమితమైన గడియారాలు నేడు సాంకేతికతను అందిపుచ్చుకొని యువతను ఆకర్షిస్తున్నాయి.

– భద్రాచలంఅర్బన్

- స్మార్ట్ వాచ్‌లపై మక్కువ చూపుతున్న యువత
- ఫ్యాషన్‌తో పాటు ఫిట్‌నెస్ కోసం వినియోగం
- అనారోగ్యాన్ని సూచించే ఫీచర్‌లెన్నో..





టైమ్ చూడొచ్చు.. కాల్స్ చేయొచ్చు..

స్మార్ట్ వాచ్‌లో సమయంతో పాటు పలు అప్లికేషన్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మన స్మార్ట్ ఫోన్‌కు అనుబంధంగా దీన్ని అనుసంధానం చేసుకొని కాల్స్ కూడా మాట్లాడవచ్చు. వాట్సప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా అప్లికేషన్లను సైతం చూసే వెసులుబాటు ఉంటుంది. మొబైల్ ఓపెన్ చేయకుండానే స్మార్ట్ వాచ్ ద్వారా సోషల్ మీడియా అప్లికేషన్లు చూడవచ్చు. అంతేకాకుండా యువత వివిధ యాప్‌ల ద్వారా సంగీతాన్ని వింటూ ఎంజాయ్ చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో స్మార్ట్ ఎలక్ట్రానిక్ పరికరాలు హల్‌చల్ చేస్తున్నాయి. అరచేతిలో ప్రపంచం.. మణికట్టుపై ఆరోగ్యాన్ని ప్రతిబింబిస్తూ.. ఫిట్‌నెస్‌ను పెంచుతున్నాయి. అన్ని బ్రాండెడ్ కంపెనీలు వీటిని మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. బ్రాండ్‌ను బట్టి దానికి సంబంధించిన యాప్‌ను స్మార్ట్ ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకొని అన్ని విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు నేరుగా పని చేస్తే.. మరికొన్ని స్మార్ట్ పరికరాలు మాత్రం ఆండ్రాయిడ్, ఐవోఎస్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో పని చేస్తాయి. ముఖ్యంగా అక్సిలేటర్ మీటర్, హార్ట్ రేట్ తెలుసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. స్లీపింగ్ టైమింగ్ తోపాటు మనం రోజులో ఎన్ని మెట్లు ఎక్కామో కూడా స్మార్ట్ బ్యాండ్స్ ద్వారా తెలుసుకోవచ్చు.

హెల్త్ మానిటర్..

స్మార్ట్ వాచ్‌లో ఆరోగ్యాన్ని గురించి ఎప్పటికప్పుడు తెలియజేసే ఫీచర్స్ అందుబాటులోకి వచ్చాయి. శరీరంలోని బీపీ, హార్ట్‌బీట్, ఆక్సిజన్ పర్సంటేజ్ వంటి వివరాలు తెలుసుకునే వెసులుబాటు ఉంది. అంతేకాకుండా ఎంతసేపు నిద్రపోయాం, ఎంతసేపు గాఢనిద్రలో ఉన్నాం, నిద్ర లేమి వంటి వివరాలను కూడా రికార్డ్ చేస్తుంది. వాకింగ్, జాగింగ్, రన్నింగ్, స్విమ్మింగ్, బ్రీతింగ్, యోగా వంటి విషయాలను మానిటర్ చేసే ఫీచర్స్ సైతం స్మార్ట్‌వాచ్‌లో ఉన్నాయి. దీంతో స్మార్ట్‌వాచ్‌లకు గిరాకీ పెరిగింది. నాణ్యతను బట్టి రూ.1500 నుంచి రూ.20 వేల వరకు లభ్యమవుతున్నాయి. కాగా ఇంతకంటే ఖరీదు గల స్మార్ట్‌వాచ్‌లు కావాలంటే ఆర్డర్లపై తెప్పించేందుకు కూడా దుకాణాల నిర్వాహకులు సిద్ధమవుతున్నారు.

ఈ–ఆరోగ్య పరికరాలు..

ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవనంలో జనాలు అనారోగ్యం బారిన పడుతున్నారు. కోవిడ్–19 తర్వాత చాలామంది సైడ్ ఎఫెక్టులతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ బ్యాండ్స్, స్మార్ట్ వాచ్, పల్స్ ఆక్సీమీటర్స్, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్, ఈథెర్మోమీటర్, ఈ–బీపీ మిషన్ వంటి వస్తువులను ప్రజలు వినియోగిస్తున్నారు. సాధారణ, బ్రాండెడ్ కంపెనీలు వీటిని మార్కెట్‌లో అందుబాటులో ఉంచుతున్నాయి. తక్కువ ధరల్లో దొరికే స్మార్ట్ ఫోన్ల ఫీచర్లను పూర్తిస్థాయిలో వినియోగించడానికి స్మార్ట్ బ్యాండ్లు, స్మార్ట్ వాచ్‌లు ఉపయుక్తంగా ఉంటున్నాయి. ఆయా కంపెనీల ఆండ్రాయిడ్ ఫీచర్ల వినియోగాన్ని బట్టి స్మార్ట్ బ్యాండ్లను తయారు చేస్తూ యువతను ఆకట్టుకుంటున్నాయి. ఫోన్ దూరంగా ఉన్నా ఈ బ్యాండ్స్ ఫోన్‌కు వచ్చే కాల్స్ సైతం తెలుపుతాయి. స్మార్ట్ బ్యాండ్‌కు ఉన్న సెన్సార్ ఆధారంగా వివరాలన్నీ తెలుస్తాయి. రూ.1,500 నుంచి రూ.90 వేలకు పైగా ధరల్లో ఈ స్మార్ట్ ఎలక్ట్రానిక్ పరికరాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.

హెల్త్ ఫీచర్ల కోసమే..



మార్కెట్లో ఎన్నోరకాల స్మార్ట్ ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అందుబాటులో ఉన్నాయి. బ్రాండెడ్ కంపెనీల గాడ్జెట్స్‌ను అడుగుతున్నారు. మామూలు కంపెనీలు రూ.1,000 నుంచి రూ.20,000, బ్రాండెడ్ కంపెనీలు రూ.50వేల నుంచి రూ.90వేల ధరల్లో ఉన్నాయి. ప్రత్యేకంగా హెల్త్ ఫీచర్స్ కోసమే చాలామంది ఆర్డర్లు ఇస్తున్నారు. ఫోన్‌లేకుండా కాల్స్, మెస్సేజ్‌లు ఆపరేట్ చేయొచ్చు. –జి.సాయికిరణ్, మొబైల్ షాప్ యజమాని

ఆరోగ్య స్థితి తెలుపుతుంది..



స్మార్ట్ వాచ్‌లో హెల్త్ ఆక్టివిటీ ట్రాక్ చేసుకున్నా. రోజు ఎంత వర్క్ అవుట్ చేస్తున్నా.. ఎంత సమయం గాఢంగా, సాధారణంగా నిద్రించిన విషయాలను తెలుపుతోంది. మన ఆరోగ్య పరిస్థితిని బట్టి ఎంతవరకు వ్యాయామం చేయాలో నిర్దేశిస్తుంది. మానసిక ఒత్తిడిని కూడా సూచిస్తుంది. మార్కెట్లో మరిన్ని అప్డేట్ ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వస్తున్నాయి.

–కె.మహేశ్‌రెడ్డి, భద్రాచలం

హార్ట్ బీట్‌ను పరీక్షిస్తా..



స్మార్ట్ వాచ్‌ను చాలా రోజులుగా వినియోగిస్తున్నా. వాచ్ ద్వారా ఎప్పటికప్పుడు హార్ట్‌బీట్‌ను పరీక్షించుకుంటూ ఉంటా, కచ్చితంగా ప్రతీ రోజు 4 వేల నుంచి 6 వేల అడుగులు నడుస్తా. చాలామంది స్మార్ట్ వాచ్‌లను సరిగా వినియోగిస్తే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందొచ్చు. స్మార్ట్ వాచ్‌ల వినియోగంతో అనారోగ్య సమస్యలను కనిపెట్టవచ్చు.

– డాక్టర్ విజయ్, చిన్నపిల్లల వైద్యుడు

పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తా..



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

దమ్మపేట: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పష్టం చేశారు. శనివారం మండలంలోని గండుగులపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు కాసేపు భోజనం వడ్డించారు. విద్యార్థులతో పాటు సహపంక్తి భోజనం చేశాక మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తానని తెలిపారు. కాగా, పాఠశాలలో జరుగుతున్న అంగన్వాడీల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు గండుగులపల్లి క్యాంప్ కార్యాలయంలో పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాభిశిల ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న గ్రామస్తులు

ములకలపల్లి: మండలంలోని మొగరాలగుప్ప గ్రామంలో శనివారం నాభిశిల ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా వేద పండితుల సమక్షంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యావాచనం, శాంతిపఠనం, క్షీరోధారణ, ప్రధాన దేవతల ఆహ్వానం, గంగాస్నానాల అనంతరం శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాపన ఘట్టాన్ని నిర్వహించారు. నాభిశిల, పోతురాజు, ముత్యాలమ్మ విగ్రహాలను జగన్నాథపురానికి కాంగ్రెస్ నాయకులు అడపా నాగేశ్వరరావు సమర్పించారు. స్థానిక కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా, టీఎన్నార్ ట్రస్ట్ చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు అన్నదానానికి రూ.20 వేలు ఇచ్చారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

అశ్వాపురం/దుమ్ముగూడెం: అశ్వాపురం, దుమ్ముగూడెం మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. అశ్వాపురం మండలం మొండికుంట, గొల్లగూడెం, మిట్టగూడెం, అశ్వాపురం, పాములపల్లి, గొందిగూడెం, జగ్గారం గ్రామాలతో పాటు దుమ్ముగూడెం మండలంలోని ములకపాడు, పెద్దబండిరేవు క్రాస్, దుమ్ముగూడెం క్రాస్ రోడ్ల వద్ద ఈ వాల్‌పోస్టర్లు కనిపించాయి. మావోయిస్టు అరాచకాలతో అమాయక ఆదివాసీలు బలవుతున్నారని అందులో ఫొటోలు, వివరాలు ముద్రించారు.

రేపు మహాజనసభ

బూర్గంపాడు: రైతు భరోసా విధి విధానాలపై రైతుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు సోమవారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో మహా జనసభ నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ సీఈఓ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభకు జిల్లా సహకార అధికారి, వ్యవసాయశాఖ డివిజన్ అధికారి హాజరవుతారని పేర్కొన్నారు.

జూలై 3న సమావేశం

దుమ్ముగూడెం: మండలంలోని గంగోలు గ్రామంలోని వీవీఆర్ ఫంక్షన్‌హాల్లో జూలై 3వ తేదీన బీఆర్‌ఎస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకుడు రావులపల్లి రాంప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తాతామధు పాల్గొంటారని వివరించారు.

రక్షణ పాటిస్తూ లక్ష్యాలు సాధించాలి

మణుగూరుటౌన్: రక్షణతో కూడిన వార్షిక లక్ష్యాలు సాధించాలని డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన పీకేఓసీ వ్యూ పాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తిని పర్యవేక్షించి మాట్లాడారు.. 126.5 లక్షల టన్నుల నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేస్తూ లక్ష్యం సాధించాలని, పని గంటలను పూర్తిగా సద్వినియోగం చేసుకుని, యాంత్రిక శక్తిని సంపూర్ణంగా వినియోగించుకుని, బొగ్గు సరఫరాలో ఆటంకం లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు రాంబాబు, వెంకట్రావు అధికారులు పాల్గొన్నారు.



ఓసీ-2 వ్యూ పాయింట్ నుంచి పరిశీలిస్తున్న అధికారులు

రైతు భరోసాపై భిన్నాభిప్రాయాలు



మాట్లాడుతున్న డీసీఓ ఖుర్షీద్

చంద్రుగొండ: రైతు భరోసా అమలుపై రైతులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. మండలంలోని గానుగపాడు సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో శనివారం రైతుభరోసా పథకం అమలుపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ నిర్వహించారు. జిల్లా సహకార శాఖాధికారి సయ్యద్ ఖుర్షీద్ సమక్షంలో రైతులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఒక్కొక్క రైతును విడివిడిగా అడిగి వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఖుర్షీద్ మాట్లాడుతూ.. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. సమావేశంలో సొసైటీ సీఈఓ లంకా నర్సింహారావు, చైర్మన్ చెవుల చందర్‌రావు, ఏఈఓ శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు పసుపులేటి వెంకటేశ్వర్లు, గుగులోతు రాందాస్ పాల్గొన్నారు.

ప్రత్యేక వర్గంగా గుర్తించాలి..

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ కార్మికులను ప్రత్యేక వర్గంగా గుర్తించి సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపీకేఎంఎస్) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు డీటీ సుచరితకు వినతిపత్రం అందించారు. అనంతరం సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో వ్యవసాయ కార్మికులు జీవనం సాగిస్తున్నారని, తక్షణమే కార్మికుల వేతనాలను రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయంలో యంత్రీకరణ పెరగిన నేపథ్యంలో కార్మికులకు ఉపాధి రోజురోజుకూ తగ్గిపోతోందని వాపోయారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోకినపల్లి ప్రభాకర్, పార్టీ మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు, కంగాల భూలక్ష్మి, కారం వెంకటేశ్, కంగాల కన్నయ్య, మడకం రాజులు, కట్టం సిరమయ్య, మడివి ముత్యాలు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన

దమ్మపేట: మండలంలోని అంకంపాలెం బాలికల ఆశ్రమ పాఠశాలలో సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. కాళ్లు, చేతుల వేళ్ల వాపుతో వంపు తిరిగి ఉండటం, ప్లీహం వాచిపోయి ఉండటం ఈ వ్యాధి లక్షణాలని తెలిపారు. అనంతరం సంబంధిత కార్యక్రమంపై క్విజ్ పోటీ నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోలెం శ్రీనివాసరావు, రమణ, శ్యామల, లత, రజినీ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చర్ల పాఠశాలలో..

చర్లరూరల్: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులకు శనివారం సికెల్‌సెల్ ఎనీమియాపై



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ తోలెం వెంకటేశ్వర్లు

కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీధర్ అవగాహన కల్పించారు. రక్తహీనత లక్షణాలు, అధిగమించేందుకు పలు సూచనలు చేశారు. హెచ్ఈఓ పి.వేణుగోపాలకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం బీసమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పలు ఆస్పత్రుల్లో వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చైతన్య, డిప్యూటీ డీఈఎంఓ ఫైజీమొద్దీన్ బృందం శనివారం తనిఖీలు చేపట్టింది. స్ప్రింగ్ ఆస్పత్రి, శ్రావ్య నర్సింగ్ హోంలను తనిఖీ చేసిన వారు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, అబార్షన్లు నిర్వహించినట్లు తేలినా చర్యలు తీసుకుం



ఆస్పత్రిలో యంత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

టామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్ఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగుదారులకు రైతుభరోసా ఇవ్వాలి



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ సుధాకర్‌రావు

అన్నపురెడ్డిపల్లి: పంటలు సాగు చేసేవారందరికీ పట్టాదారు పాస్‌పుస్తకంతో సంబంధం లేకుండా రైతుభరోసా పథకాన్ని ఇవ్వాలని గుంపెన సొసైటీ చైర్మన్ బోయినపల్లి సుధాకర్‌రావు అన్నారు. శనివారం స్థానిక సొసైటీ కార్యాలయంలో డీసీఓ సయ్యద్ ఖుర్షీద్ ఆధ్వర్యంలో ప్రత్యేక మహాజన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు పథకంలానే రైతు భరోసా పథకాన్ని కుడా అమలు చేయాలని, తద్వారా సన్న, చిన్నకారు రైతులందరికీ మేలు జరుగుతుందని కోరారు. కార్యక్రమంలో ఏఓ అనూష, సీఈఓ సున్నం వెంకటేశ్వర్లు, ఏఈఓ సంధ్యారాణి, సొసైటీ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల భూముల జోలికొస్తే సహించేది లేదు

కరకగూడెం: ఏజెన్సీలో గిరిజనేతరులు గిరిజనుల భూముల జోలికొస్తే సహించేది లేదని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, మన్య సీమ పరిరక్షణ డోల్‌దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గొప్ప వీరయ్య హెచ్చరించారు. శనివారం కరకగూడెం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్యదొరకు సంబంధించిన 10 గుంటల భూమిని సుమారు 21 ఏళ్ల కిందట కరకగూడెంనకు చెందిన ఓ గిరిజనేతర వ్యక్తి విక్రయించి, ఇప్పుడు కబ్జా చేస్తున్నాడని నిరసన తెలిపారు. నాడు గ్రామపెద్దల సమక్షంలో భూమిని విక్రయించి నేడు తప్పుడు పత్రాలు సృష్టించి హైకోర్టులో కేసు వేశారని, గిరిజన చట్టాలను విస్మరించి దొంగచాటున ప్రభుత్వ భూమిని కూడా సదరు గిరిజనేతరుడు పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశామని



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

చెప్పారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ఆర్గనైజర్ పొడుగు శ్రీనాథ్, నాయకులు పాయం సత్యనారాయణ, వాసం రామకృష్ణ, ముక్తి రాజు, రమణాల లక్ష్మయ్య, చందా మహేశ్, వట్టం జనార్దన్, అలెం కోటి, వజ్జా నర్సింహారావు, గొగ్గలి రామకృష్ణ, రవి, కొమరం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన శిక్షణ



చిత్రలేఖనం ద్వారా బోధించే పద్ధతిని వివరిస్తున్న మాస్టర్ ట్రెయినీలు

అశ్వారావుపేటరూరల్: నూతన విద్యా విధానంపై అంగన్‌వాడీ టీచర్లకు అందిస్తున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమం శనివారం కుడా కొనసాగింది. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో రెండో విడత శిక్షణకు టీచర్లు హాజరు కాగా, మాస్టర్ ట్రెనీ వరలక్ష్మి ఆధ్వర్యంలో జాతీయ విద్యా విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురు అంగన్‌వాడీ టీచర్లు చిత్రలేఖనం ద్వారా చిన్నారులకు సులభంగా బోధన అందించే పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ రోజారాణి, సూపర్‌వైజర్లు సౌజన్య, పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు నెమళ్ల ఉషాదేవి, నాగమణి, రమణ, దుర్గ, లక్ష్మీ, శాంతకుమారి, వాణి, మరియమ్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీయాగం

మణుగూరుటౌన్: సింగరేణి పీవీకాలనీలోని కనక దుర్గ అమ్మవారి 12వ పుష్కర వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చండీయాగం నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి సుప్రభాత సేవ, 6 గంటలకు గణపతి పూజ, పుణ్యావాచనం, చక్రవణ నవదుర్గ దేవతల కుంభాభిషేకం తదితర పూజలను ఆలయ పూజారి రమేశ్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.



ప్రచండ చండీయాగంలో పాల్గొన్న భక్తులు

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు ప్రదానం చేస్తున్న మణుగూరు ఆర్టీసీ డీఎం టి.స్వామి

మణుగూరురూరల్: టీజీఆర్టీసీ మణుగూరు డిపో మేనేజర్ టి.స్వామి ఆధ్వర్యంలో 'రోజుకు లక్షే లక్ష్యం, ఉద్యోగుల కర్తవ్యం వారి కుటుంబ సభ్యుల పాత్ర, సహకారం' అనే అంశాలపై ఉద్యోగుల పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. వారిలో పి.లక్ష్మీదుర్గ ప్రథమ, ఎస్.ప్రణీత ద్వితీయ, టి.నిత్యశ్రీ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు వెంకట్‌నారాయణ, డిపో మేనేజర్ స్వామి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలపై అవగాహన

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మణుగూరు డిపో పరిధిలోని ప్రయాణికులకు కల్పిస్తున్న సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ టి.స్వామి తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని మణుగూరు సురక్షా బస్టాండ్ వద్ద ప్రయాణికులకు ఆర్టీసీ సేవలపై అవగాహన కల్పించారు. ఆర్టీసి బస్సులో ప్రయాణం చేసే వారు ఎనిమిది రోజుల ముందుగా రిజర్వేషన్ చేయించుకుంటే వారికి రిజర్వేషన్ చార్జీలు వర్తించవని, డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని, లహరి నాన్ ఏసీ, లహరి ఏసీ స్లీపర్ వంటి ఆర్టీసీ సర్వీసులకు మాత్రమే ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు.